

అభివృద్ధిపై ఆశలు

ప్రజలు ఓటేసి ఎన్నుకున్న వారు ఎమ్మెల్యే లుగా శాసన సభలో ప్రమాణస్వీకారాలు చేశారు.
8లో▸



కారుణ్య నియామకం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ భార్యకు సీఎం చొరవతో కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చింది.
8లో▸



ఆటోవాలాలను ఆదుకోవాలి

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
8లో▸

న్యూస్‌రీల్

చందనవెల్లి ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం



షాబాద్: మండల పరిధిలోని చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శించింది. ఉత్తరప్రదేశ్ నుంచి డాక్టర్ రాజేశ్‌పటేల్, గుజరాత్ నుంచి డాక్టర్ శ్రీధర్ రావు తదితరులు చందనవెల్లి ఆస్పత్రిలో వివిధ పథకాల ద్వారా రోగులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. పూర్తి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వెల్లడించారు. డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి బృందం సభ్యులకు వివరించారు. అనంతరం అక్కడి నుంచి షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, డాక్టర్లు వరలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉపకార వేతనాల కోసం నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: 2023–24 సంవత్సరానికిగాను నూతన పోస్ట్‌–మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరు కోసం జిల్లాలోని కళాశాలల విద్యార్థులు 'ఈ పాస్ వెబ్‌సైట్'లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రిన్సిపాల్స్ అవగాహన కల్పించాలన్నారు. 2017–2018 నుంచి 2023–24 వరకు విద్యార్థుల హార్డ్ కాపీలను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని, ఈ నెల 31వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

భవిష్యత్ తరాలకు బంగారు నేలనిద్దాం

- పద్మశ్రీ అవార్డు గ్రహీత, వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్
- గో ఆధారిత పంటల సాగుపై రైతులకు అవగాహన



ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త పాలేకర్

ధారూరు: గో ఆధారిత విధానంలో పండించే ప్రకృతి వ్యవసాయ పంటలపై పద్మశ్రీ సుభాష్ పాలేకర్ శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. బూర్గుగడ్డలోని పాలేకర్ పరిశోధన కృషి వ్యవసాయ క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కు చెందిన సుమారు 500 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీరో బడ్జెట్ సేంద్రియ వ్యవసాయం, సహజ పద్ధతులు ఉపయోగించి భూమి, భూసారాన్ని కాపాడి, భవిష్యత్ తరాలకు బంగారు నేలను అందించాలని సూచించారు. దేశవాళీ ఆవుల పేడ, మూత్రం ద్వారా ఘనామృతం, జీవామృతం తయారుచేసి, పంటల సాగుకు వినియోగించాలని సూచించారు. ఈ విధానాలను రైతులకు వివరించారు. అనంతరం పరిశోధన కేంద్రంలోని గోశాల, పందిరి పంటలు, పసుపు, బహురూప కాల పంటలను పరిశీలించారు. కొత్తగా ప్రకృతి వ్యవసాయ చేసే రైతుల కోసం విత్తనాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవ్ స్వస్పంద సంస్థ డైరెక్టర్ విజయరామ్, ఇస్కాన్ హరే రామ, హరే క్రిష్ణా ప్రతినిధులు, సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మెగా చిచ్చు!

ఫార్మాసిటీని రద్దు చేసి.. సదరు భూముల్లో మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటన గందరగోళానికి తెరలేపింది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను వెనక్కి ఇస్తామని ప్రచారం చేసి.. ఆ స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారం నిర్వహించేలా టౌన్‌షిప్ ప్రతిపాదనను తెరమీదకు తేవడం సరికొత్త వివాదానికి దారితీసింది. ఫార్మాసిటీ రద్దు ప్రకటన చర్చనీయాంశంగా మారింది. – సాక్షి, రంగారెడ్డిజిల్లా

కొందరికి మోదం.. ఇంకొందరికి ఖేదం

- ఫార్మా సిటీ రద్దుతో ఆశలు గల్లంతు
- బాధితులకు భూమి అప్పగింతపై సందిగ్ధం
- చర్చనీయాంశంగా ఫార్మాసిటీ రద్దు వ్యవహారం



జిల్లాలోని కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాలకు చెందిన పది గ్రామాల పరిధిలో 19,333 ఎకరాల్లో ముచ్చర్లలో ఫార్మా సిటీని ఏర్పాటు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఔషధరంగ సంస్థల దిగ్గజాలతో విహంగ వీక్షణం చేసిన అప్పటి సీఎం కేసీఆర్.. ఫార్మాసిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే వడివడిగా భూ సేకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కూడా పూర్తి చేశారు. కాగా.. భూ సేకరణలో జరిగిన అవకతవకలు, పరిహారం చెల్లింపులో హేతుబద్ధత లేక పోవడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే 12,300 వేల ఎకరాలను రెవెన్యూ యంత్రాంగం సేకరించి.. టీఎస్‌ఐఐసీకి బదలాయించింది. అతిత్వరలోనే ప్రాజెక్టుకు భూమి పూజ చేయాలని భావించిన క్రమంలోనే బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. దీంతో కథ అడ్డం తిరిగింది. అధికారంలోకి రావడానికి ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. హామీ మేరకు ఫార్మాను రద్దు చేస్తున్నామని, దాని స్థానంలో మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఫార్మా రద్దయిందనే వార్త స్థానిక రైతులకు ఊరటనివ్వగా.. అదే స్థాయిలో నిరాశ కూడా మిగిల్చింది. ఫార్మా కోసం సేకరించిన భూములను వెనక్కి ఇస్తారని ఆశలు పెట్టుకున్నవారికి ఈ స్థలంలో టౌన్‌షిప్ నిర్మిస్తామనే ప్రకటన ఆందోళనకు గురి చేస్తోంది. ఫార్మా సిటీతో ఉపాధి అవకాశాలు వస్తాయని భావించిన నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్టైంది.

ఖర్చుల సంగతేమిటి?

భూసేకరణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2 వేల కోట్లకు పైగా ఇక్కడ ఖర్చు చేసింది. ఎస్‌బీఐ రూ.వెయ్యి కోట్లు రుణం ఇచ్చేందుకు అంగీకరించి రూ.600 కోట్లు విడుదల చేసింది. హడ్కో ద్వారా రూ.740 కోట్లు అప్పు తీసుకుంది. ఫార్మాసిటీలో పలు ఇండస్ట్రీయల్ పార్కుల్లో రూ.1600 కోట్ల పెట్టుబడులు పెట్టేం దుకు దుబాయికి చెందిన కూలింగ్ యుటిలిటీ కంపెనీ తబ్రీడ్ ముందుకొచ్చింది. సంస్థ ప్రతినిధులతో ఎంఓయూ కూడా జరిగింది. కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ) ఏర్పాటుకు కేంద్రం రూ.500 కోట్లు ఇచ్చింది. కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 100 అడుగుల రోడ్డును విస్తరించింది. 48 ఎకరాల్లో రూ.5,809 కోట్లతో అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు చేసింది. 180 ఎకరాల్లో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సహా ఆ పరిసర ప్రాంతాల్లోని 19 గ్రామాల కోసం మేడిపల్లిలో పోలీస్‌స్టేషన్ కోసం ఐదు ఎకరాలు కేటాయించింది. భూ బాధితుల కోసం టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో మీర్‌ఖాన్‌పేటలో 600 ఎకరాల్లో వెంచర్‌ను అభివృద్ధి చేసి ఒక్కో ఎకరానికి 121 గజాల చొప్పున బాధితులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. మరికొంత మంది ఈ స్థలాల కోసం ఎదురు చూస్తున్నారు. తాజా నిర్ణయంతో ఈ పంపకాల అంశం సందిగ్ధంలో పడింది.

ఆ భూములు రైతులకిచ్చేనా?

ఫార్మాసిటీ కోసం కుర్మిద్ద, మేడిపల్లి రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కొంది. వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని కోర్టులో జమ చేసింది. అయితే భూ సేకరణలో అనేక లోపాలున్నాయని పేర్కొంటూ ఆయా గ్రామాల రైతులు కోర్టును ఆశ్రయించారు. భూసేకరణ చట్టం 2013లోని 15(2),16,18 సెక్షన్లకు విరుద్ధంగా ఈ భూములు సేకరించినట్లు కోర్టు ధ్రువీకరించింది. భూసేకరణ ప్రక్రియను ఇటీవల రద్దు చేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని 1702 ఎకరాల భూసేకరణ మళ్లీ మొదటి కొచ్చింది. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కనీసం ఈ భూములను రైతులకే తిరిగి అప్పగిస్తుందా? లేక ప్రస్తుత మార్కెట్ మేరకు మళ్లీ సేకరించనుందా? అనే అంశంపై కూడా స్పష్టత లేక పోవడంతో ఆయా రైతుల్లో ఆందోళనకు గురవుతున్నారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఉద్యమించి, జైలుకు వెళ్లివచ్చిన వారిపై ఉన్న కేసుల సంగతేమిటనేదీ తేలాల్సి ఉంది.



జీరో టికెట్ షురూ

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో వారం రోజులుగా ఎలాంటి గుర్తింపు పత్రం లేకుండానే అనుమతించారు. శుక్రవారం నుంచి ఆధార్, ఓటర్ ఐడీ, నివాస ధ్రువీకరణ తదితర పత్రాల్లో ఏదైనా ఒకటి చూపించాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మహిళా ప్రయాణికులకు బస్సు కండక్టర్లు జీరో టికెట్‌ను ఇవ్వడం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయాలనుకునే మహిళలు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారిగా ఏదైనా గుర్తింపు పత్రం చూపించడం తప్పనిసరి అని కండక్టర్లు స్పష్టంచేశారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దీనదయాళ్ ఠాగూర్

మహిళలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

ఆలిండియా సహకార భారతి అధ్యక్షుడు దీననాథ్ ఠాగూర్

నందిగామ: భారత ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తోందని ఆలిండియా సహకార భారతి అధ్యక్షుడు దీననాథ్ ఠాగూర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత మహిళా సహకార మూడో సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ.. దేశంలోని 26 రాష్ట్రాల నుంచి సుమారు 3వేల మంది మహిళలు ఈ కార్యక్రమానికి హాజరు కావడం సంతోషకరమని అన్నారు. సహకార భారతి పలు సహకార సంఘాల సభ్యులకు వివిధ వ్యాపారాల గురించి శిక్షణ ఇస్తుందని వివరించారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు, విస్తరించుకునేందుకు కావాల్సిన వనరులు, మార్కెటింగ్ తదితర విషయాల గురించి శిక్షణ ఇచ్చి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్‌తో కలిసి ధ్యానం చేశారు. కార్యక్రమంలో సహకార భారతి కార్యదర్శి ఉదయ్ జోషి, మహిళా ప్రముఖులు రేవతి చందూర్ నికర్, భాగ్యశ్రీ సాటే, భగవతి బల్దేవ, రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగిళ్ల కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

వంద కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి కారు డిక్కీలో తరలింపు
- సురంగల్ శివారులో డంప్ చేస్తుండగా స్వాధీనం
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి



పట్టుకున్న గంజాయిని చూపిస్తూ కేసు వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

మొయినాబాద్: కారు డిక్కీలో తీసుకొచ్చిన వంద కిలోల గంజాయి ప్యాకెట్లను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ రష్మి తెర్మల్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగా, తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం బికనీర్, ప్రతాప్ బస్తీకి చెందిన భావర్‌ఖాన్ మేడ్చల్ ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఒడిశా రాష్ట్రం రాయఘడ్ జిల్లా పదంపూర్‌లో మనోజ్ అనే వ్యక్తి దగ్గర రూ.5.50 లక్షలకు 100 కిలోల ఎండు గంజాయి (50 ప్యాకెట్లు) కొనుగోలు చేశాడు. వాటిని తన కారు (టీఎస్ 35 ఈ 5279) డిక్కీలో పెట్టుకుని నగరంలోని ధూల్‌పేటకు చెందిన సునీల్ సింగ్‌కు అమ్మడానికి వచ్చాడు. అతని ఫోన్ చేయగా తాను అందుబాటులో లేనని.. మొయినాబాద్ మండలం సురంగల్ శివారులో ఉన్న ఏఎంఆర్ వెంచర్‌లోని ఓ ప్లాట్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి దగ్గరకు వెళ్లాలని.. అక్కడ తన బావమరిది వినేష్ సింగ్‌గాని, తమ్ముడు నితేష్ సింగ్‌గానీ ఉంటారని చెప్పాడు. ముందుగా మాట్లాడుకున్న రేటు ప్రకారం అమ్మడానికి భావర్‌ఖాన్ శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో సదరు వెంచర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి చేరుకున్నాడు.

పక్కా సమాచారంతో..

ముడిమ్యాల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందన్న పుకార్లతో మొయినాబాద్ ఎస్సై కిషన్ సింగ్, హెడ్‌కానిస్టేబుల్ దేవి సింగ్, కానిస్టేబుల్ రాజు, హోంగార్డు సత్తయ్య బృందం వెంకటాపూర్, శ్రీరాం నగర్, సురంగల్ గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తోంది. గంజాయి విక్రయిస్తున్నట్లు వారికి సమాచారం అందింది. అక్కడికి వెళ్లి చూడగా ఇద్దరు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంటనే పట్టుకున్నారు. అక్కడే ఉన్న కారు డిక్కీ తెరిచి చూడగా 50 గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. గంజాయి తెచ్చిన భావర్‌ఖాన్‌ను, నితేష్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితోపాటు కారు, స్కూటీ, రెండు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సునీల్‌సింగ్, అతని భార్య నందిని, అత్త లక్ష్మీబాయి, మరో వ్యక్తి అభిషేక్, రాయఘడ్‌కు చెందిన మనోజ్ పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని డీసీపీ తెలిపారు. గంజాయి పట్టుకున్న పోలీసు బృందాన్ని అభినందించారు. కాగా భావర్‌ఖాన్‌పై 2021లో నల్లగొండ రూరల్ పోలిస్‌స్టేషన్‌లో గుట్కా రవాణా కేసు నమోదైంది. నితేష్‌సింగ్‌పై మంగళ్‌హాట్ పోలిస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు ఉంది.

అయ్యో పాపం!

మూడున్నరేళ్లకే నూరేళ్లు నిండాయి

- స్కూల్ బస్సు చక్రాల కింద నలిగిపోయిన బాలుడు
- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం: కుటుంబ సభ్యుల ఆరోపణ



ప్రణయ్ (ఫైల్)

కుషాయిగూడ: అప్పటి దాకా అక్క, అన్నయ్యతో సరదాగా ఆడుకుంటూ గడిపిన మూడున్నరేళ్ల బాలుడిని స్కూల్ బస్సు చిదిమేసిన హృదయ విదారక ఘటనతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. చిరునవ్వులతో తమ వెంట ఉన్న చిన్నారి కళ్లెదుటే క్షణాల్లో అసువులు బాయడంతో ఆ ప్రాంతంలో రోదనలు మిన్నంటాయి. శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి వివరాల ప్రకారం..

బీఎన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న నీల మౌనికకు ఇద్దరు కుమారులు హేమంత్ (9), మూడున్నరేళ్ల ప్రణయ్‌తో పాటు కూతురు స్నేహ ఉన్నారు. భర్తతో విభేదాలు రావడంతో మౌనిక రెండేళ్లుగా బీఎన్‌రెడ్డి నగర్‌లోని పుట్టింట్లో నివాసం ఉంటోంది. ఇళ్లల్లో పని చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. శుక్రవారం హేమంత్, స్నేహ స్కూల్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో చిన్న కుమారుడు ప్రణయ్‌ను అమ్మమ్మ కనకమ్మ ఇంటి అరుగుపై కూర్చొబెట్టిన తల్లి మౌనిక.. హేమంత్, స్నేహలను స్కూల్ బస్సు ఎక్కించేందుకు వెళ్లింది. అదే సమయంలో ప్రణయ్ అరుగు దిగి రోడ్డుపైకి వచ్చాడు. దీనిని గమనించకుండా డ్రైవర్ బస్సును




ఘటన స్థలం వద్ద రోదిస్తున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు

ముందుకు పోనివ్వడంతో ప్రణయ్ ముందు చక్రాల కింద పడి నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. తలపై నుంచి బస్సు వెళ్లడంతో ఆ ప్రాంతమంతా రక్తపు మడుగును తలపించింది. మృతుడి తల్లి, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలుడి మేనమామ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అ'క్రమబద్ధీకరణ'!

కుంట్లూరు నాలుగు రోడ్ల కూడలిలో ఖాళీ స్థలం

- సర్వే నంబర్ 24లో రూ.20 కోట్ల విలువ చేసే భూమి
- కోర్టుల్లో కేసులు.. మున్సిపాలిటీ అభ్యంతరాలు
- అయినా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం.. గుడ్డిగా రెగ్యులరైజేషన్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కోర్టు కేసులు, ఎలాంటి వివాదాలు లేని ప్రభుత్వ భూములను (పేదలు కబ్జాలో ఉన్నవి) క్రమబద్ధీకరించేందుకు తీసుకొచ్చిన జీఓ నంబర్ 59 అక్రమబద్ధీకరణకు వేదికైంది. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీలకు వచ్చిన తహసీల్దార్లు ఆక్రమణదారుల నుంచి భారీగా లబ్ధి పొంది కోర్టుల్లో పెండింగ్ కేసులు, స్థానికంగా అభ్యంతరాలున్న వివాదాస్పద ప్రభుత్వ భూమిని చాలా తక్కువ ధరకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు.

కోర్టులో పెండింగ్ కేసు

కుంట్లూరులోని నాలుగు రోడ్ల కూడలి సర్వే నంబర్ 24లో సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ప్రస్తుతం గజం ధర రూ.50 వేల పైమాటే. ఖరీదైన ఈ భూమిపై ఓ నేత కన్నుపడింది. ఈ భూమిలో తరచూ అక్రమ నిర్మాణాలు వెలుస్తుండటం, రెవెన్యూ అధికారులు వాటిని కూల్చేస్తుండటం అందరికీ తెలిసిందే. ఇది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ 17/2/2012లోనే అప్పటి రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. హైకోర్టుకు కూడా ఇదే అంశాన్ని (ప్రొసీడింగ్ నంబర్ సీ/733/2022) పేర్కొంది. డబ్ల్యూపీ నంబర్ 5773/2012 ప్రకారం ఇది పూర్తిగా ప్రభుత్వ భూమిగా పేర్కొనబడింది. దీనిపై హైకోర్టులో పిల్ (నంబర్ 85/2022) పెండింగ్‌లో ఉంది. ఈ భూమిని క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానికంగా ఉన్న ఓ కుటుంబానికి చెందిన ఏడుగురు జీఓ నంబర్ 59 కింద ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించి..

ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న ఎలాంటి వివాదం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీఓ నంబర్ 59 తీసుకొచ్చింది. తొలుత 2014 జూలై 2 కటాఫ్ డేట్ ప్రకటించింది. ఆ తర్వాత 2020 జూలై 2 కటాఫ్ డేట్‌గా ప్రకటించింది. దరఖాస్తుదారు ఇందుకు ఏదో ఒక (ఇంటి నంబర్, ఆస్తిపన్ను చెల్లింపు రసీదు, కరెంట్, వాటర్ కనెక్షన్ మీటర్) ఆధారాన్ని చూపించాలని స్పష్టం చేసింది. ఇదే అదనుగా భావించిన సదరు ఆక్రమణదారులు కోర్టులో పెండింగ్ కేసు ఉన్న భూమికి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి గుట్టుగా జీఓ నంబర్ 59 కింద దరఖాస్తు చేశారు. విషయాన్ని గుర్తించిన పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ వైస్ చైర్మన్ తహశీల్దార్ సహా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అంతు చిక్కని అధికారుల ఆంతర్యం

మొత్తం ఏడుగురు 4,074 గజాల స్థలాన్ని జీఓ నంబర్ 59 కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు పెట్టుకున్నారు. నిజానికి కుంట్లూరు రెవెన్యూ పెద్ద అంబర్‌పేట్ నగర పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఇది 2013లో నగర పంచాయతీగా ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఇంటి నంబరు జారీ చేయలేదు. ఆస్తి పన్ను వసూలు చేయలేదు. కరెంట్, వాటర్ కనెక్షను జారీ చేయలేదు. హైకోర్టులో కేసు పెండింగ్ ఉంది. స్థానిక మున్సిపాలిటీ నుంచి కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన సదరు రెవెన్యూ అధికారులు ఇవేవీ పట్టించుకోలేదు. రూ.కోట్ల విలువైన ఈ భూమిని చాలా తక్కువ ధరకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటో అంతు చిక్కడం లేదు.

గోరువెచ్చగా.. ఉండునిచ్చట!

చలి పులి మనుషుల్నే కాదు మూగజీవాలను సైతం గజగజా వణికిస్తోంది. నగరంలోని నెహ్రూ జంతు ప్రదర్శన శాల అధికారులు వన్యప్రాణులు, పక్షులు, సరీసృపాలు చలి ప్రభావం నుంచి గట్టెక్కేలా ఎన్‌క్లోజర్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వన్యప్రాణులకు అందించే ఆహారం, పానీయాల్లోనూ మార్పులు చేసినట్లు జంతు ప్రదర్శన శాల డైరెక్టర్ వీఎస్‌ఎన్‌వీ ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ డాక్టర్ అహ్మద్ అబ్దుల్ హకీం పేర్కొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ తీగల చోరీ

మంచాల: వ్యవసాయ పొలం వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరు చోరీకి గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక సర్పంచ్ శివ రాల పాండు వివరాల ప్రకారం.. తిప్పాయిగూడలోని ముకునూర్ రోడ్డు సమీపంలో చిల్లాపురం రాములు వ్యవసాయ బావి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గురువారం రాత్రి దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ తీగను ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన రైతులు విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ తీగలను అపహరిస్తున్నారని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆరుగురు జూదరుల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు చేసిన దాడుల్లో ఆరుమంది జూదరులను అరెస్టు చేయడంతో పాటు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదిబట్ల ఎస్‌ఐ శ్రీనివాస్ రావు కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్‌సిటీ జెన్నాయిగూడ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఆదిబట్ల పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో రావిర్యాలకి చెందిన జంగయ్య, లింగం, సంజీవ, బాలేశ్, పాశం లింగం, నరేందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రూ.83,600, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూద క్రీడలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

అభివృద్ధిపై ఆశలు

- అసెంబ్లీలో అధికంగా నూతన ఎమ్మెల్యేలు
- ప్రభుత్వం నుంచి నిధుల సేకరణ, పౌర హక్కుల రక్షణ బాధ్యత వారిదే
- ఇప్పటికే శాసనసభ్యులకు శిక్షణ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు

షాద్‌నగర్: ప్రజలు ఓటేసి ఎన్నుకున్న వారు ఎమ్మెల్యేలుగా శాసన సభలో ప్రమాణస్వీకారాలు చేశారు. ఇక నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు. అయితే పాలనలో శాసనసభ్యులు బహుముఖ పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేగా వారి విధులు, బాధ్యతలు, ప్రభుత్వం వారికి ఇచ్చే జీత భత్యాలు, నియోజకవర్గ అభివృద్ధిలో వారి పాత్రను తెలుసుకుందాం.

సభలకు 'తొలి' పరిచయం

అధికార పార్టీకి చెందిన వారిలో చాలా మంది తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో వీరికి ఇటీవల కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్యేల బాధ్యతలు, విధులు, హక్కులు, అసెంబ్లీ నియమ నిబంధనలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నుకోబడిన వారు శాసనసభలో సభ్యులు అవుతారు. నియోజకవర్గం తరపున శాసనసభకు ప్రాతినిథ్యం వహిస్తారు. స్వప్రయోజనాలకు, విపక్షకు తావులేకుండా న్యాయం చేయడం శాసనసభ్యుల ప్రధాన విధి.

వేతన వివరాలు

పదవి	వేతనం
ముఖ్యమంత్రి	రూ.4.21లక్షలు
స్పీకర్	రూ.4.11లక్షలు
మంత్రులు, చీఫ్ విప్, విప్	రూ.4లక్షలు

- వీరికి రాష్ట్రపతి ఎన్నికలో ఓటు హక్కు ఉంటుంది
- శాసనసభా కమిటీల్లో సభ్యులుగా ఉంటారు.
- రాష్ట్ర ప్రభుత్వ చట్టాల రూపకల్పనలోనూ భాగస్వామ్యులవుతారు.
- మున్సిపాలిటీలకు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు.

నిధులు.. సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి భారత రాజ్యాంగం చట్టాలను రూపకల్పన చేసే అధికారం కల్పించింది. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ఆర్టికల్ 246 పొందుపర్చిన విధంగా రాష్ట్ర జాబితా, ఏకకాలిక జాబితాలోని అన్ని అంశాలపై చట్టాలను రూపకల్పన చేయవచ్చు.
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ కలిగి ఉండేది శాసనసభ ఒక్కటే. ప్రభుత్వం సమర్పించే బడ్జెట్‌ను ఎమ్మెల్యే చర్చించి ఆమోదిస్తారు.
- ప్రభుత్వం రూపొందించే పథకాలను సమర్థవంతంగా అమలు అయ్యేలా.. అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాల్సి ఉంటుంది.



- నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంతో పాటుగా పనుల తీరు తెన్నులను పర్యవేక్షించాలి.
- ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలి.
- అభివృద్ధి పనుల పురోగతి, సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాలి.
- పౌర హక్కులకు రక్షణగా నిలిచి వ్యవస్థలను పటిష్టం చేయాలి.
- పట్టణాల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీ నుంచి నిధులు తీసుకువచ్చి ఖర్చు చేసే వీలుంటుంది.
- ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి నిధులు రాబట్టి అభివృద్ధి పనులు చేయొచ్చు.
- మంత్రులు, ఎమ్మెల్సీలను సమన్వయం చేసుకుని ప్రత్యేక నిధులను సద్వినియోగం చేసుకోవచ్చు.
- వివిధ మంత్రిత్వ శాఖల నుంచి మంజూరయ్యే నిధులతోనూ నియోజకవర్గ అభివృద్ధికి వీలుంటుంది.

ఎమ్మెల్యేలకు జీతం.. మాజీలకు పెన్షన్

ఎమ్మెల్యేకు జీతం ఎంత ఉంటుందో చాలా మందికి అవగాహన ఉండదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఎమ్మెల్యేల స్థూల నెలసరి వేతనం 163శాతం పెరిగింది. ప్రస్తుతం ఒక్కో ఎమ్మెల్యే నెలకు రూ.2.50లక్షలు జీతం తీసుకుంటున్నారు. ఇందులో వీరి అసలు వేతనం రూ.20వేలు అయితే నియోజకవర్గ అలవెన్సుల కింద ప్రభుత్వం రూ.2.30లక్షలు అందజేస్తుంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన సభ్యుడి రోజువారి భత్యం రూ.వేయి చెల్లిస్తారు. పదవీ కాలం ముగిసిన తర్వాత పెన్షన్ సైతం అందుతుంది.

రూ.5 కోట్ల సీడీఎఫ్ నిధులు

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం 119 శాసన సభ్యులకు ప్రతీ సంవత్సరం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్) కింద రూ.5కోట్లు కేటాయిస్తుంది. ఇలా మంజూరు చేసిన నిధులను పల్లెలు, పట్టణాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌కు పర్యావరణ అవార్డు

రాయదుర్గం: పర్యావరణ కాలుష్య నివారణ సదస్సులో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ఉత్తమ పేపర్ ప్రజెంటేషన్ అవార్డును గెలుచుకుంది. భవన నిర్మాణం చేస్తున్నప్పుడు ఏర్పడే కాలుష్యంపై ట్రిపుల్‌ఐటీ బృందం అధ్యయనం చేసి సమర్పించిన పేపర్ ప్రజెంటేషన్ అందరినీ ఆకట్టుకుంది. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఇటీవల 'పర్యావరణ కాలుష్యం-నివారణ'పై జరిగిన 11వ అంతర్జాతీయ సదస్సు-2023లో 'కంపారిటివ్ అనాలిసిస్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ రిలేటెడ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ ఇండోర్ అండ్ అవుట్‌డోర్ ఎన్విరాన్‌మెంట్స్' అనే అంశంపై రూపొందించిన పరిశోధనా పత్రాన్ని ట్రిపుల్ ఐటీ బృందం ప్రదర్శించింది. దీన్ని పరిశీలించి అవార్డుకు ఎంపిక చేశారు. ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ సచిన్ చౌదరి, ప్రొఫెసర్ కవిత ఆధ్వర్యంలోని బృందం ఈ పరిశోధనా పత్రాన్ని అంతర్జాతీయ సదస్సులో సమర్పించారు.

మింట్ కాంపౌండ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖైరతాబాద్: సచివాలయం నార్త్ ఈస్ట్ గేట్ నుంచి మింట్ కాంపౌండ్ మీదుగా ఉన్న రోడ్డులో అక్రమ పార్కింగ్ తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు రంగం సిద్ధం చేశారు. వారం రోజుల్లో మింట్ కాంపౌండ్ రోడ్డులో రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్.బి.రత్నం తెలిపారు. శుక్రవారం ఏసీపీ ఆధ్వర్యంలో సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ వై.రాజశేఖర్ నేతృత్వంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. సచివాలయం నార్త్ ఈస్ట్ గేట్ నుంచి మింట్ కంపౌండ్ మీదుగా ఐమాక్స్ వైపునకు వెళ్లే రోడ్డు మార్గంలో ఆక్రమణలు, వ్యాపారాలు, అక్రమ పార్కింగ్‌ను వారం రోజుల్లో పూర్తిగా తొలగిస్తామని తెలిపారు.

సీఎం చొరవతో కారుణ్య నియామకం

గంటల వ్యవధిలోనే బాధిత మహిళకు ఉద్యోగం

కందుకూరు: రెండేళ్ల క్రితం విధుల్లో ఉండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలీస్ కానిస్టేబుల్ భార్యకు సీఎం చొరవతో గంటల వ్యవధిలోనే కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సొంగ శేఖర్ అంబర్‌పేట పోలీస్ హెడ్ క్వార్టర్ పరిధిలో విధులు నిర్వర్తించేవారు. ఆయన 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సత్యలతను వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప ఉంది. 2021 సెప్టెంబర్ 30న ఆయన విధుల్లో ఉండగా రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందారు. దీంతో అప్పటి నుంచి ఆయన భార్య ఉద్యోగం కోసం పోలీసుల అధికారుల చుట్టూ తిరిగినా నాన్ లోకల్ కారణం చూపుతూ ఫైల్ పక్కకు పెట్టారు. దీంతో మృతుడి స్నేహితుడైన మరో కానిస్టేబుల్ శ్రీనివాస్ సహకారంతో శుక్రవారం ఉదయం సత్యలత పాపతో పాటు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన గోడును వినిపించారు. వెంటనే స్పందించిన సీఎం ఆమెకు ఉద్యోగం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. గంటల వ్యవధిలోనే సత్యలతకు రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పిస్తూ ఆర్డర్ జారీ అయింది. దీంతో ఆమెతో పాటు కుటుంబీకులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.



సత్యలతకు హామీ ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చేవెళ్ల అభివృద్ధికి సహకరించండి



మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర మంత్రి సీతక్కను చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం నగరంలోని ఆమె నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ ఉపాధ్యాక్షుడు జనార్దన్‌రెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యాక్షుడు పాండు, మాజీ సర్పంచ్ నర్సింలు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ, మహేశ్‌కుమార్‌గౌడ్‌లను సైతం కలిసి అభినందనలు ప్రకటించారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా అన్ని నియోజకవర్గాల ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు

చేవెళ్ల: ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలానికి చెందిన గండు మంజుల(45) చేవెళ్లలోని ఓ ఆసుపత్రిలో పనిచేస్తోంది. అనిల్‌కుమార్, బాల్‌రాజులు ఆటోలో మంజులను ఎక్కించుకొని షాబాద్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలోని మల్లారెడ్డిగూడ బస్‌స్టేజీకి సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తాపడిందన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంజుల మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాల్‌రాజ్‌కు కాలి విరిగి తీవ్రంగా గాయపడగా అనిల్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. మద్యం మత్తులో ఆటో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చేవెళ్ల ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

భార్య మృతిపై సందేహం..

తన భార్య మృతిపై తనకు అనుమానం ఉందని భర్త గిరిజాపతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి తన భార్యను ఆటోలో ఎక్కించుకొని డబ్బులు, నగల కోసం బాగా మద్యం తాగించి హత్యచేసి ఉంటారని అనుమానం ఉందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు అనుమానస్పద మృతిగా కూడా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోవాలాలను ఆదుకోవాలి

ప్రతినిధుల జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రావు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు, ఓనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆటో ప్రతినిధుల జేఏసీ చైర్మన్ మడుపు వేణుగోపాల్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల, ఓనర్ల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో నియోజకవర్గంలోని 2500 మంది ఆటో డ్రైవర్లు, ఓనర్లు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. కొనుగోలు చేసిన బండ్లకు ఈఎంఐలు చెల్లించలేక, డీజిల్ ధరలు భరించలేక వారి కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ఆలోచించి ప్రతి నెల రూ.12 వేలు అందించాలని, ఉచితంగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. తహసీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాల అందజేశారు.



ప్రదర్శన చేస్తున్న ఆటో డ్రైవర్లు, ఓనర్లు

చోరీకి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు



చోరీకి యత్నించిన రామాంజనేయులు

ఇబ్రహీంపట్నం: చోరీకి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసి జైల్‌కు తరలించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపటేల్‌గూడ గ్రామానికి చెందిన సుబ్బురు శేఖర్‌కు ఇబ్రహీంపట్నంలో మెడికల్ షాప్ ఉంది. ఈ నెల 12న మెడికల్ దుకాణం తాళాలు పగులగొట్టి అందులోని సామగ్రిని చిందర వందరగా కిందపడేశారు. స్థానికులు గమనించి సమాచారాన్ని యాజమాని శేఖర్‌కు అందజేశారు. షాపులో చోరీకి యత్నించినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దొంగల కోసం గాలించారు. గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఇబ్రహీంపట్నంలోని ఒక పాన్‌షాపు వద్ద తిరుగుతుండగా నైట్ డ్యూటీ పోలీసులు ఓ యువకున్ని అదుపులోకి తీసుకొని విచారించారు. అతడు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని బుడగ జంగాల కాలనీకి చెందిన వేముల రామాంజనేయులు(21)గా గుర్తించారు. మెడికల్ షాపులో చోరీకి పాల్పడింది తానేనని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అంతేగాక అతనిపై కల్వకుర్తి పీఎస్ పరిధిలో నాలుగు, దేవరకొండ పీఎస్ పరిధిలో ఒక కేసు ఉన్నట్లు విచారణలో వెల్లడించారు.

భర్తతో గొడవ.. వివాహిత ఆత్మహత్య

మల్లాపూర్: భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన రేణు రాణి కునల్ (36, జంగ భడూ కునల్ భార్యాభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకుదెరువు కోసం మల్లాపూర్ భవానీ నగర్‌కు వచ్చారు. భర్త జంగ భడూ కునల్‌తో శుక్రవారం గొడవ జరిగింది. దీంతో పాపని పాఠశాలకు తీసుకు వెళ్లిన సమయంలో రేణు ఇంటి తలుపులు పెట్టుకుని..ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... కొత్తగూడ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ అమీన్ అహ్మద్(42) తన భార్య అరాఫత్ జహాన్‌తో కలిసి శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లో బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో అతివేగంతో వచ్చిన బైక్ (ఏపీ11బీ8599) ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన అమీన్ అహ్మద్ అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అరాఫత్ జహాన్‌ను కేర్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు మృతుడి సోదరుడు అఖిల్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 304(ఏ),337 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఓయూలో స్టార్టప్ ఫెస్ట్-24

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వేదికగా ఫిబ్రవరిలో ఉస్మానియా-ఇండియా స్టార్టప్ ఫెస్ట్-24ను నిర్వహించనున్నారు. శుక్రవారం ఓయూ పాలన భవనంలో అధికారులు ఫెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉస్మానియా ఫౌండేషన్ (ఓఎఫ్), ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పనిచేయనున్నట్లు తెలిపారు.